క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు



అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ అవార్డు లభించింది. ఈనెల 19న ఏపీ రాష్ట్రంలోని ఒంగోలులో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యాన ఆయనను సన్మానించి అవార్డు అందజేశారు. ఈ విషయాన్ని బుధవారం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలను రద్దు చేసే ఆలోచన విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేసే ఆలోచన విరమించుకోవాలని, అదేజరిగితే ఉద్యమిస్తామని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ హెచ్చరించారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కొత్త జిల్లాల రద్దు కోసం కమిటీ వేస్తామని ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం పుట్టిన కొత్తగూడెం కేంద్రంగా ఏర్పాటైన జిల్లాను రద్దు చేసి ప్రజల ఆర్థిక వనరుల మీద దెబ్బ కొట్టాలని యత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు సాయి, వంగా రవిశంకర్, సందెల సందీప్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: యువకుడికి పెళ్లి సంబంధం మాట్లాడే విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతసూరారం గ్రామంలో బుధవారం హరి, బిందు, మంగమ్మ కలిసి అదే గ్రామానికి చెందిన శిరీష ఇంట్లో వివాహ సంబంధం మాట్లాడుతున్నారు. ఇంతలోనే మాటామాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. ఈ మేరకు తనపై దాడి చేశారంటూ శిరీష ఫిర్యాదుతో హరి, బిందు, మంగమ్మపై మంగళవారం కేసునమోదు చేసినట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు.

అక్రమ కేసు గర్హనీయం

ఇల్లెందు: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మీద పూసపల్లి కుట్ర కేసు నమోదు చేయడం దుర్మార్గమని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు జె.గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇల్లెందు జేకే కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ జిల్లాకు ఎలాంటి సంబంధం లేని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తి మొగిలి వెంకటరెడ్డి కుట్రలో పాల్గొన్నట్టు ఇరికించటం అంటే ముమ్మాటికి కుట్రలో భాగంగా కేసులో ఇరికించారని తేలిపోయిందన్నారు. తక్షణం కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధు, నరేష్, పార్థు, వంశీ, శశివర్ధన్ పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని గెలిపించాలి

ఇల్లెందు: బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని దిండిగాల రాజేందర్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన్ను గెలిపించాలని ప్రచారం చేశారు. పరుచూరి వెంకటేశ్వరరావు, చాంద్‌పాషా, అబ్దుల్లా, గిన్నారపు రాజేష్, మహేందర్, సాతెల్ల హరికృష్ణ, పాలడుగు రాజశేఖర్, శ్రీను ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న సీహెచ్‌పీల్లో క్వాలిటీ విభాగం కేసీఎస్ కంపెనీలో థర్డ్‌పార్టీ శ్యాంపుల్స్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని క్వాలిటీ ఎస్‌వోటూ జీఎం వినోద్‌కుమార్‌ను పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికుల కంపెనీవారు ఇచ్చే వేతనాలు అంతంత మాత్రమే, ఇచ్చే నామమాత్రపు వేతనాలు సకాలంలో ఇవ్వాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి వేతనాలు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గట్టయ్య, రమేష్, శ్యామ్, పారుపెల్లి వినోద్, నవీన్, హరిలాల్, దేవేందర్, శశి, చంద్ర, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌పై ముందస్తు యుద్ధం

మున్సిపాలిటీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

- నీటి నిల్వ ఉండకూడదనే ప్రధాన ఉద్దేశం
- డ్రైయినేజీల్లో, రోడ్ల వెంట చెత్తాచెదారం తొలగింపు
- బయట నుంచి కార్మికులు, వాహనాలను అందుబాటులోకి..



డ్రైయినేజీలో చెత్తాచెదారం తొలగిస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల భారీన పట్టణ ప్రజలు పడకూడదనే ఆలోచనతో మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను గత సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. వర్షపు నీరు డ్రైయినేజీల్లో నిల్వకుండా ఉండేందుకు ప్రధాన డ్రైయినేజీల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. వర్షపు నీరు డ్రైయినేజీల్లో నిల్వడం, ఆ నీరు రోడ్లు, ఇళ్ల ముందుకురావడం, రోజుల తరబడి నిలిచి ఉండడంతో దోమల విజృంభన, విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని డ్రైయినేజీల్లో పేరకుపోయిన సీల్టును తొలగిస్తున్నారు. ఇందుకుగానూ మున్సిపాలిటీల్లో ఉన్న రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులతో పాటుగా బయట నుంచి ప్రైవేట్ కార్మికులను, యంత్రాలను, వాహనాలను ఎంగేజ్ చేసుకుంటూ శానిటేషన్ పనులను నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, ఉపయోగంలో లేని చెట్లను తొలగిస్తున్నారు. ప్రధానంగా ముంపికి వాడలుగా ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు చేయిస్తున్నారు. రామవరంలోని పంజాబ్‌గడ్డ, 7 నెంబర్ బజార్, పట్టణంలోని బూడిదగడ్డ, పాతకొత్తగూడెం, న్యూగొల్లగూడెం, సఫాయిబస్తీ, కూలీలైన్ ఏరియాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

కార్మికులు, పరికరాలు ఇలా...

కొత్తగూడెం ఏ గ్రేడ్ మున్సిపాలిటీలో రెగ్యూలర్, కాంట్రాక్టు కార్మికులు మొత్తం 202 మంది ఉన్నారు. వీరంతా కూడా రోజు వారీ కార్యక్రమంలో భాగంగా వార్డుకు ముగ్గురు చొప్పున విధులు నిర్వహిస్తూ, శానిటేషన్ పనులు చేస్తున్నారు. అయినప్పటికీ పట్టణంలోని ప్రధాన సెంటర్లు రైతుబజార్ ఏరియా, చిన్నబజార్, పెద్దబజార్, రైటర్‌బస్తీ గొల్లగూడెం వంటి ఏరియాల్లో చెత్తాచెదారం నిల్వ ఉండడం, డ్రైయినేజీలు శుభ్రం చేయకపోవడం వంటి జరుగడంతో ఆయా వార్డుల్లో నిత్యం దుర్వాసన ఈగలు, దోమలతో అక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చేపడుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆయా ఏరియాల్లో పనులు జరిగితే శానిటేషన్ కొంత మెరుగుపడే అవకాశం ఉంటుంది. కొత్తగూడెం జిల్లా కేంద్రం అయిన దగ్గర నుంచి కొంత జనాభా సంఖ్య కూడా పెరగడంతో రోజు వారీగా వెలువడుతున్న చెత్తాచెదారం ఎక్కువైంది. దానికి తగ్గట్టుగా మున్సిపాలిటీల్లో కార్మికుల సంఖ్య లేకపోవడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని పెద్ద పెద్ద డ్రైయినేజీల్లో ఉన్న సీల్టు జామ్‌లను తొలగిస్తున్నారు.



పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



ఈ స్పెషల్ డ్రైవ్ నిమిత్తం మున్సిపాలిటీలోని కార్మికులతో పాటుగా రోజుకు బయట నుంచి దాదాపు 40 మంది కార్మికులను ఎంగేజ్ చేస్తున్నారు. వీటితో పాటుగా ప్రస్తుతం మున్సిపాలిటీలో ట్రాలీలు-42, ట్రాక్టర్లు-05, జేసీబీ-01, క్లీనింగ్ మిషన్-01, స్వీపింగ్ మిషిన్-01, ఫాగింగ్ యంత్రాలు-06 ఉండగా, బయట నుంచి ట్రాక్టర్లు-10, జేసీబీలు-04 ఎంగేజ్ చేస్తున్నారు. ఎక్కడా నీటి నిల్వలు ఉండకూడదనే ప్రధాన ఉద్దేశ్యంతో స్పెషల్ నిర్వహిస్తున్న ఈ స్పెషల్ డ్రైవ్ వర్షాకాలంలో ఎంత ఫలితాలను ఇస్తుందో వేచి చూడాల్సిన అవసరమంది.

సీజనల్ వ్యాధులను తప్పించేందుకే..



మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా వార్డుల్లో ఉండే పెద్ద డ్రైయినేజీల్లో పేరుకపోయి సీల్టును తొలగిస్తున్నాం. దీంతో పాటుగా ఖాళీ స్థలాల్లో ఉన్న మొక్కలను, ఎండిపోయిన చెట్లను తొలగిస్తున్నాం. ఇందుకోసం మున్సిపాలిటీలోని కార్మికులతో పాటుగా బయట నుంచి కార్మికులను, యంత్రాలను ఎంగేజ్ చేసి పనులు చేయిస్తున్నాం.

– శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

జూలూరుపాడు: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట (జీలుగ, జనుము) విత్తనాలు గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు స్థానిక సహకార సంఘం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నారు. జీలుగ విత్తనాల 30 కిలోల బ్యాగు ధర సబ్సిడీ పోను రూ.1,116, అదేవిధంగా 40 కిలోల జనుము విత్తనాల బ్యాగు ధర రూ.1,448లు చెల్లించి తీసుకోవచ్చని తెలిపింది. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ వ్యవసాయ శాఖ అధికారులకు ఇచ్చి కూపన్ తీసుకుని, స్థానిక సొసైటీ కార్యాలయంలో అందజేసి పొందాలని పేర్కొంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జూలూరుపాడు సహకార సంఘం కోరింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు

పాల్వంచరూరల్: ఈనెల 27వ తేదిన జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు మండలంలో మూడు సెంటర్లలో 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ వివేక్ బుధవారం తెలిపారు. కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ స్కూల్లో, బొల్లోరిగూడెం స్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలు, బీసీఎం రోడ్డులోని గిరిజన ఆశ్రమ పాఠశాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మండల, పట్టణ పరిధిలో మొత్తం 4,664 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోగా 2,505 మంది పురుషులు, 2,159 మహిళ ఓటర్లు ఉన్నారని తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ చూపాలి..



దుస్తులు పంపిణీ చేస్తున్న మన్నెమ్మ

పాల్వంచరూరల్: వేసవి సెలవుల్లో ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న క్రీడల కోచింగ్ క్యాంప్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) మన్నెమ్మ అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలో క్రీడాపాఠశాల్లో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను డీడీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న గిరిజన క్రీడా విద్యార్థులకు దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన క్రీడా విద్యార్థులు వివిధ క్రీడల్లో మెలవకులు నేర్చుకుని ఆయా క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. శిక్షణ సమయాన్ని వృథా చేయకుండా తర్ఫీదు పొందిన క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాధికారి గోపాల్‌రావు, ఏఎస్ఓ కొమరం వెంకటనారాయణ, హెచ్‌ఎం.చందు, కోచ్‌లు వెంకటేశ్వర్లు, ఎస్.రామారావు, రాంబాబు, నివాసు, జి.ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, రవి, జి.మారప్ప, ఎస్.బాబురావు, జె.నాగరాజు, దివ్య, బాపనమ్మ, కె.నాగమణి, వార్డెన్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

బడి ప్రారంభానికల్లా యూనిఫామ్ సిద్ధం



దుస్తులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

ఇల్లెందురూరల్: పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి ఏకరూప దుస్తులు సిద్ధం చేస్తామని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలానికి చేరుకున్న యూనిఫామ్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 99 పాఠశాలలకు సంబంధించిన 3,797 మంది విద్యార్థులకు అవసరమైన దుస్తులు మండలానికి వచ్చాయన్నారు. పొదుపు సంఘాల మహిళలు దుస్తులను కుట్టేందుకు మొత్తం ఏడు కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దుస్తుల కుట్టు పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు కమిటీ వేశామన్నారు. ఏపీఎం దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి..

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ నాయకులు ఐఎన్‌టీయూసీ ఏరియా మాజీ కార్యదర్శి హరణ్‌ఖాన్ బుధవారం మృతి చెందగా పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గొల్లపెల్లి దయానంద్, నాయకులు మోత్కురి ధర్మారావు, బాలశౌరి, దోర్నాల పాపారావు, చింతల చెర్వు గోర్షం, గిడ్ల పరంజ్యోతి, గౌస్, సురేందర్, చంద్రయ్య, గుబ్బల శ్రీను, హుస్సేన్, జాన్‌పాషా, అబ్దుల్ రజాక్, శాంతిరాం తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: వర్షాకాలం ప్రారంభమవుతున్నందున గ్రామాలలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపర్చేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నప్పటికీ వర్షాకాలంలో మురుగునీరు పారేలా మురుగుకాల్వలను శుభ్రం చేయాలని, వీధులలో నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చివేయాలన్నారు. దోమలకు ఆవాసాలుగా ఉండే ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లించాలని, దోమల నివారణ మందులను పిచికారీ చేయాలని ఆదేశించారు. ఎంపీవో చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంజాబ్‌లో ఎన్నికల కో అబ్జర్వర్‌గా మొయినుద్దీన్



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ విభాగం, సింగరేణి కార్మిక నాయకుడు ఖాజా గౌస్ మొయినుద్దీన్ పంజాబ్‌లోని ఆనందపుర్‌షహిబ్ నియోజకవర్గంలో కో ఆబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య మొయినుద్దీన్ నియామకపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సాంబమూర్తి,ఈశ్వర్ గౌడ్, బోళ్ల సూర్యం, ఎల్. కృష్ణ, జాఫర్, మున్నా, అక్తర్, రాజు గౌడ్‌లు ఉన్నారు.

అటవీ భూముల్లో బోర్లు వేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ముఖ్తార్ హుస్సేన్

టేకులపల్లి: అటవీ, పోడు భూముల్లో అనుమతులు లేకుండా ఎవరైనా బోర్లు వేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని టేకులపల్లి రేంజ్ ఎఫ్ఆర్ఓ ఎండి.ముఖ్తార్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండల పరిధిలోని తొమ్మిదో మైలుతండా, గోలియాతండా, వెంకట్యాతండా గ్రామాల్లో ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించారు. పోడు భూముల్లో బోర్లు వేయాలంటే ఐటీడీఏ పీఓ అనుమతి తీసుకోవాలన్నారు. సోలార్, జనరేటర్ ద్వారా బోర్లను వినియోగించాలని, వన్య ప్రాణులను వేటాడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు బి.శ్రీను, బి.దేవ్‌సింగ్, డీఆర్‌వో బి.కృష్ణ, ఎఫ్‌బీవోలు బి.పవన్‌కుమార్, బి.రాంసింగ్, ఎస్.నగేష్, కె.కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల నిర్మాత సత్యనారాయణ



మాట్లాడుతున్న కనకయ్య

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ఉద్యమాల నిర్మాత పర్సా సత్యనారాయణ అని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో బుధవారం నిర్వహించిన సత్యనారాయణ వర్ధంతి సమావేశంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించాక కనకయ్య మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించి కార్మికుల తరపున అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆ తర్వాత సీఐటీయూ ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, అశ్వారావుపేట ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

పాల్వంచ: పర్సా సత్యనారాయణ ఆశయాలు సాధించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేశ్ అన్నారు. సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమంలో నివాళులర్పించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఎవి.అప్పారావు, దొడ్డా రవికుమార్, కె. సత్య, గట్టయ్య, రాములు, సాయికృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ బాధితుల న్యాయం కోసం పోరాడుతా..



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

టేకులపల్లి: కేటీసీ బాధితులకు న్యాయం జరిగేలా పోరాడుతానని ఆదివాసీ సంఘాలు బలపర్చిన ఫార్వర్డ్ బ్లాక్ మానుకోట ఎంపీ అభ్యర్థి డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం గోదావరి పరివాహక ప్రాంతాల పర్యటనలో భాగంగా టేకులపల్లి మండలం కిష్టారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక యువత కేటీసీలో జరుగుతున్న అన్యాయాల గురించి అరుణ్‌కుమార్‌కు వివరించారు. కోయగూడెం ఓసీ మైనింగ్ గ్రామానికి దగ్గరలో ఉండటం వల్ల బ్లాస్టింగ్ కారణంగా దుమ్ముధూళితో కాలుష్యం అవుతోందని, స్థానిక యువతకు ఎలాంటి ఉపాధి దక్కడం లేదని వాపోయారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్థానిక గ్రామాలకు చెందిన యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చింతా సంపత్, కుర్స నాగేశ్వరరావు, చింత కన్నారావు, గొగ్గల నాగేశ్వరరావు, వేప సుమన్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి




ఇల్లెందు: ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే నేతృత్వంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జే.వెంకటేశ్వర్లు, పింగళి నరేష్, రమేష్, సాగర్, పులిగళ్ల మాధవరావు, చిల్లా శ్రీనివాస్, రాంచందర్, మున్నా పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎండీ.రియాజ్ కోరారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయం, గ్రంథాలయంలో ఆయన ప్రచారం చేశారు. ఆ తర్వాత రామవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రియాజ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ చట్టసభలను బలోపేతం చేయడంలో భాగంగానే తీన్మార్ మల్లన్నకు టికెట్ కేటాయించిందన్నారు. కాగా, వచ్చే ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయించడమే కాక, గ్రూప్ – 2, 3 పోస్టుల సంఖ్య పెంపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోపాలరావు, తూము చౌదరి, నాగా శీతారాములు, ఆకునూరి కనకరాజు, కొదురుపాక రాజేందర్, డి.సతీస్, ఎం.రమేష్, సతీష్, మహేష్, నవీన్, శ్రీను, చిలక రవి, సుప్రియ పాల్గొన్నారు.

పాల్వంచ: మిత్ర పక్షాలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. మండలంలోని జగన్నాథపురం పెద్దమ్మ గుడి వద్ద నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లు పాలించినా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలం చెందాయన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, బండి నాగేశ్వరరావు, రాహుల్, ఎ.పద్మజ, నాగరాజు, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీనివాసరావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నరహరి నాగేశ్వరరావు, లాల్‌పాషా, జకరయ్య, అజిత్, సృజన, నారాయణ పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్



పాల్వంచ: ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

మూలనపడ్డ వాటర్ ప్లాంట్..!

- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- దాహార్తితో అవస్థ పడుతున్న ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు



ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ (ఇన్‌సెట్) పనిచేయని ప్లాంట్ పరికరాలు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మినరల్ వాటర్‌ప్లాంట్ మూలనపడింది.ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజల సురక్షితమైన తాగునీటి అందించాలనే లక్ష్యంతో తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయ సంఘం మండల కమిటీ ఆర్థిక సహకారంతో మూడేళ్ల క్రితం మినరల్ వాటర్ ప్లాంట్ నెలకొల్పారు. కొన్ని నెలల క్రితం మినరల్ వాటర్ ప్లాంట్ యంత్ర పరికరాలు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు అందుబాటులో లేకుండా పోయింది. వాటర్‌ప్లాంట్ మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్లాంట్ నిర్వాహణ విషయంలో వైద్యశాఖ అధికారులు, వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తాగునీరు అందుబాటులో లేకుండాపోయిందని రోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్లాంట్ మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా అధికారులు, వైద్యసిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో దాహార్తి తీర్చుకునేందుకు తాగునీటి కోసం బయటకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బాగు చేసి తాగునీరు అందుబాటులోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.